



# టాక్ షో కథలు

## – కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 900 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# చలం జీవితం – సాహిత్యం

## -16-

*. "చలం ఎవరు అనేది, నేను ఎవరు? అనే ప్రశ్నంత జటిలం. బాల్యంలో చలం వేరు. బ్రహ్మ సమాజంలో తిరిగిన చలం వేరు. చిత్రాంగీ, పురూరవా, జయదేవా, హరిశ్చంద్ర రాసిన చలం వేరు. మైదానం, బ్రాహ్మణీకం, హంపీ కన్యలూ, నవలలూ, కథలూ రాసి, ఆంధ్ర దేశాన్ని మంచికో, చెడుకో అటూ, ఇటూ ఊపి, సంచలనాలు రేపిన చలం వేరు. అయినప్పటికీ అతని జీవితం, అతని సాహిత్యం, అతని ఆలోచనలూ, అతని ప్రణయతత్వం, అతని స్త్రీ వ్యామోహం, అతని ఆదర్శాలూ, అతని విసుగూ, అతని కోపం, అతని నిరాశా, అతని నిస్పృహా, అతని ఆనందం, అతని విషాదం అన్నీ కూడా నలుగురితో పంచుకొని జీవించారు. చలం నైతికంలోనూ, ఆధ్యాత్మికంలోనూ, తీవ్రవాది. 'మహా ప్రస్థానానికి పీఠిక రాసిన చలానికీ, భవద్గీతకు వాఖ్యానం రాసిన చలానికీ తేడా లేదు.' అనుకోవడం వెర్రితనం.*

*కొన్ని నియమాలకీ, కొన్ని సూత్రాలకీ, కొన్ని పడికట్టు రాళ్ళకీ, కొన్ని ప్రమాణాలకీ, నిలువ లేకపోయినంత మాత్రాన, అతను అనార్కిస్ట్ కాదు. ఉంటే, అనార్కిజం ఈ వ్యవస్థలోనే వుంది. చలం ఉన్నతమైన స్వేచ్ఛకోసం కలలు కని, తపించి, బాధ పడినవాడు. ఆధ్యాత్మికంలోకి ఎదిగాక, తను రాసినదంతా, తను చేసినదంతా చీకటి*

*సముద్రంలోకి, వెలిగించిన కాగడాల్ని విసిరేయడంతో పోల్చిన వాడు. ఎవరికీ ఏమీ కాని చలం తన జీవితంతో, తన సాహిత్యంతో, అందరికీ తానే అయి, వటవృక్షంలా నిలబడాలనుకున్నాడు. ఇప్పుడు చలం ఎవరు? అంటే నండూరి సుబ్బారావు గారు అన్నట్లు "వెలుగు నీడల వైపు వేలు చూపింతు."*

- ఇవి చలం గారి గురించి 1980 లలో తెలుగు వెలుగు చలం, ఆంధ్రాలో చలం, అరుణా చలంలో చలం, అని మూడు సంకలనాలు వెలువరించిన ప్రముఖ రచయతా, పత్రికా సంపాదకుడూ, పురాణం సుబ్రహ్మణ్యశర్మ గారు రాసిన వాక్యాలు.

తెలుగు సాహిత్య చరిత్రలో ఏ రచయితా చెయ్యని సాహసం, వ్యక్తిగత జీవితాన్ని నూటికి నూరు పాళ్ళూ తెరచిన పుస్తకం చెయ్యడం, ఒక్క చలం గారికే సాధ్యమైంది. ఏ దూషణ, భూషణాదులకూ చలించక తన మనసులోని భావాలను నిస్సంకోచంగా, నిర్ద్వందంగా, నిర్భయంగా వెలువరించిన నిత్య సాహసి, నిరంతర అన్వేషి చలం– గుడిపాటి వెంకట చలం. ఇప్పుడు1970–79 మధ్యలో చలంగారి సుదీర్ఘ జీవన ప్రయాణంలో చిట్టచివరి ఘట్టం గురించి తెలుసుకుందాం.

రంగనాయకమ్మగారి మరణంతో, చలం గారూ, పిల్లలూ మాత్రం అరుణాచలం లో మిగిలారు. అప్పటికి చలంగారు అరుణాచలం వచ్చి సరిగ్గా 20 సంవత్సరాలు అయింది. ఈ 20 ఏళ్లలో ఏదో ఒకసారి మద్రాసో, బెంగళూరో వెళ్లడం తప్పించి, తిరువణ్ణామలై నుండి కాలు బయట పెట్టలేదు. ఆంధ్రదేశం వైపు అయితే అసలు వెళ్లనేలేదు. అయినా గానీ, చలంగారిని చూడడానికి వచ్చే, సందర్శకుల సంఖ్య, ప్రతి సంవత్సరం పెరుగుతూనే వుంది. ఆ దశాబ్దాలలో ప్రత్యేకంగా చలంగారి కోసం వచ్చే ఆరాధకులూ, జీవితం కొట్టే దెబ్బలకు తాళలేక , చలంగారి సాన్నిహిత్యంలో, సాంత్వన కోసం వచ్చే దగాపడ్డ తమ్ముళ్లూ, చెల్లెళ్ళూ వీళ్లంతా ఒక వర్గం అయితే, భగవాన్ రమణ మహర్షి దర్శనానికి వచ్చి, పక్కనే వున్న చలంగారిని చూడ్డానికి వచ్చేవారు ఇంకో రకం. చలం గారి దర్శనం కోసం ఏకంగా 100, 150 మంది కలసి, రెండు, మూడు యాత్రా స్పెషల్ బస్సులు మాట్లాడుకొని, కేవలం ఆయన కోసమే ఆంధ్ర దేశం నుండి వచ్చిన సందర్భాలు కూడా వున్నాయి.

ఎంత మంది వచ్చినా, చలంగారు ఎప్పుడూ చెరగని చిరునవ్వుతో ఆహ్వానించేవారు. అందరికీ తమతో పాటే భోజనం వడ్డించేవారు. ఎవరు ఎంత కాలం ఉంటామని అన్నా కాదనేవారు కాదు. ఎవ్వర్నీ "ఎప్పుడు వెళతారు?" అని కూడా అడిగేవారు కాదు. చలంగారికి పెరుగుతున్న పాపులారిటీని చూసి, భరించలేక, "ఇక్కడకి ఎవరెవరో వస్తున్నారు. ఆడవాళ్ళూ, మగవాళ్ళూ కూడా. అక్కడ ఏవో సంఘ వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్నాయి."అని పోలీసు రిపోర్టులు ఇచ్చిన స్థానిక ప్రబుద్ధులు కూడా వున్నారు. పోలీసులు అర్ధరాత్రీ, అపరాత్రీ అనకుండా చలం గారి ఇంటిని తనిఖీ చేసిన సందర్భాలు వున్నాయి. ఎన్ని అపోహలూ, ఎన్ని ఆటంకాలూ, ఎన్ని ఆరోపణలూ వచ్చినా దేనికీ

భయపడలేదు. వెన్ను చూపలేదు. “నాకెందుకొచ్చింది” అని తిరోగామి కాలేదు. చాచిన దయా హస్తాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తీసుకోలేదు. అన్నిటినీ  తన చిరునవ్వుతోనే ఎదుర్కొన్నారు. “చలం మహర్షి, చలం ఆశ్రమం అనే పిలుపుకు ఆయన మాత్రమే అర్హులు” అనేటంతగా ఆ ప్రాంగణాన్ని అనంత కరుణా సాగరం లాగ కొనసాగించారు.

జాలీ, దయా, కరుణా, ప్రేమా, అనురాగం ఇలాంటివి తప్ప, ఎలాంటి ప్రతికూల భావాలకు ఆ ప్రాంగణం లో చోటు ఉండేది కాదు. ఇంకో విశేషం ఏమిటంటే, చలం గారిని చూడడానికి వచ్చే వ్యక్తులలో సినీ ప్రముఖులు చాలా మంది ఉండేవారు. ఈ తిరువణ్ణామలై దగ్గర్లోనే “సాతనూర్ డాం “అని ఒకటి ఉండేది. ఆ డాం దగ్గర తెలుగు సినిమా పాటలు ఎక్కువగా చిత్రించేవారు. ఆ షూటింగ్ కోసం వచ్చేవాళ్ళు చాలా మంది చలం గారి దగ్గరకు వస్తుండేవారు. సినీ తారలు శారదా, వాణిశ్రీ, సుకన్యా లాంటి వారు కూడా వాళ్లలో వున్నారు.

“వాణిశ్రీగారు చలంగారిని చూడ్డానికి చాలా సార్లు వచ్చేవార”ని చలం గారి మనవరాలు ‘కిట్టూ’ గారు చెప్పారు. అలాగే ఆదుర్తి సుబ్బారావుగారూ, జూనియర్ సముద్రాలగారూ చలంగారిని దర్శించిన వాళ్లలో వున్నారు. గొల్లపూడి మారుతీరావుగారూ, దర్శకులు వంశీగారు కూడా చలంగారిని తాము సందర్శించినటువంటి ఆ సందర్భాలూ, ఆ అనుభవాలూ నాతో ప్రత్యక్షంగా పంచుకున్నారు. వాళ్ళ దగ్గర నుండి చలం గారి గురించిన విశేషాలు వినడం.. అది నాకొక అరుదైన అవకాశం., N.T.R  సతీమణి, బసవరామ తారకంగారు కూడా చలంగారి సందర్శనం కోసం వెళ్లారు.

చివరి సంవత్సరాల్లో చలంగారు కదలలేని స్థితిలో ఉన్నప్పుడు ప్రముఖ తత్వవేత్త యూ.జి. క్రిష్ణ మూర్తిగారూ, ఆధ్యాత్మిక గురువు జిల్లెళ్ళ మూడి అమ్మ వాళ్ళు కూడా ప్రత్యేకంగా అరుణాచలం వెళ్లి, చలంగారి దగ్గర కూర్చొని, కాసేపు ఆయనతో మాట్లాడి వెళ్లారు. మరొక విశేషమేమంటే –  చలం గారు ఇన్ని పుస్తకాలు రాశారు. ఇన్ని చేశారు. ఇంత సంచలనం సృష్టించారు కదా! ఒకే ఒక్కసారి ఆయనకు సన్మానం జరిగింది. అది కూడా ఆయన వెళ్ళాక, 1967 లో హైదరాబాద్ నుండి, పోతుకూచి సాంబశివరావుగారు ప్రత్యేకంగా అరుణాచలం వెళ్లి, చలం గారిని సన్మానించారు. చలం గారికి జరిగిన మొట్టమొదటి, చిట్టచివరి సన్మానం అదొక్కటే.

చలం గారిని సందర్శించే వేలాది మంది ఒక కోణం అయితే, ఆయన కుటుంబ సభ్యులను నమ్ముకుని వాళ్ళ చుట్టూ పెరిగిన మూగ జీవాలు అదొక ప్రపంచం. రమణస్థాన్ లో, అంటే చలంగారి ఇంట్లో, పెంపుడు కుక్కలూ, గోరింకలూ, నెమళ్ళూ, చిలకలూ, పిల్లులూ, పిచ్చుకలూ ఇలా అనేకం ఉండేవి. వాళ్ళ ఆవరణలో పాడి కోసమని ఒక ఆవు కూడా ఉండేది. చలంగారి వీటినన్నిటిని స్నేహితుల్లాగా చూస్తుండేవారు. వాటికి పేర్లు పెట్టుకొని ఆ పేర్లతోనే పిలుస్తుండేవారు. చలం గారు 1950 లో బెజవాడ నుండి వాళ్ళతో పాటు ఒక కుక్కని తీసుకువచ్చారని

చెప్పుకున్నాం. ఆ కుక్క పిల్లపేరు "లూలూ". అలాగే మరికొన్ని కుక్కలు, పెంపుడు కుక్కల్లాగా తిరుగుతుండేవి. వాటికి జ్యోతీ, మోతీ, మీరా లాంటి పేర్లు ఉండేవి. ఒకసారి ఒక నెమలి గుడ్డు ఎక్కడో దొరికితే, దాన్ని కాకితో పొది గించారట. దాన్నించి వచ్చిన నెమలి పేరు 'హీరా'. ఆ హీరా ఎప్పుడూ సౌరీస్ దగ్గరే తిరుగుతూ, ఎవరైనా సౌరీస్ దగ్గరకు వస్తుంటే, రాకుండా వాళ్ళని ముక్కుతో పొడుస్తుండేదట.

అలాగే చలంగారూ, వాళ్ళ కుటుంబ సభ్యులూ, బయటకు షికారు వెళ్ళినపుడు ఎక్కడైనా గాయపడిన జంతువులు గానీ, పక్షులు గానీ కనపడితే వాటిని తీసుకువచ్చి, ఆరోగ్యం సరిగా చేసి, బాగయినంత వరకూ వాళ్ళే చూసుకునేవారు. అలా గాయపడిన ఒక గోరింక వాళ్ళింటికి వచ్చి, 3 నెలలు వీళ్ళతో వుంది తరువాత ఎగిరిపోయింది. ఆ గోరింక పేరు 'బుజ్జిగాడు' అని పెట్టుకొని, చలంగారు "బుజ్జిగాడు"అనే పేరుతో ఒక పుస్తకం రాశారు. ఆ గోరింక గనక తన దినచర్య రాసుకుంటే ఎలా ఉంటుంది? అనేది అందులో విషయం. అలాగే వాళ్ళ ఇంట్లో ఉన్న ఆవుదూడ పేరు "బుజ్జాయి". ఒక చిలక ఉండేది దానిపేరు "రంగ సాని"అని పేరు పెట్టుకున్నారు. చలంగారు మరణించాక ఆ చిలక వెళ్ళి, ఆయన్ని ఆత్మీయంగా ఆ ముఖాన్ని తడిమిందట. ఇవికాక పిచ్చుకలూ, కాకులూ ఉండేవి. ఆ కాకులు ఆవకాయ అన్నం పెడితేగాని తినేవికావట. అలాగే వీళ్ళందరూ ఉదయం భోజనం చేసాక, నర్తకి ఈ పక్షులకీ, ఇంట్లో తిరిగే పిల్లులకీ వాటికి ఏం కావాలంటే అవి పెడుతుండేదట. ఆ విధంగా మూగజీవాలని కూడా తమ కుటుంబంలో ఒక భాగంగానే భావిస్తూ ఉండేవారు. ఇవన్నీ వాళ్లకి వున్న కరుణా హృదయానికి ఉదాహరణలు.

ఇక ఈ చివరి సంవత్సరాల్లో చలంగారి జీవితంలో కొన్ని మైలు రాళ్లు అనదగ్గ విషయాలకు వస్తే...

1972 వ సంవత్సరానికి ఒక ప్రత్యేకత వుంది. అదేమిటంటే, చాలా రోజులుగా, చాలా మంది అడుగుతున్నా గానీ, ఆయన చెయ్యని పని – ఆత్మకథ రాయడం. రాయడం అంటే, అప్పటికి చేత్తో రాసే శక్తి పోయింది. అలాగే చూపుకూడా సరిగ్గా ఆనడం లేదు. అలాంటి రోజుల్లో ఆయన వెనకాలబడి, ఒకాయన "ఆత్మకథ రాయండి"అని , ఎలాగైతేనేం ఒప్పించాడు. ఆ వ్యక్తి పేరు "వాలిచర్ల విశ్వరూపాచారి"ఆయన నర్సారావు పేటలో స్టేట్ బ్యాంకులో పని చేస్తుండేవారు. తరవాత రోజుల్లో చలంగారి మనవరాలు జయశ్రీ గారిని, ఆమెను "కాకా"అంటారు, వివాహం చేసుకున్నారు. ఆయన పదేపదే పోరిన మీదట, చలం గారు, ఒక మాట అన్నారు " ఒక పని చెయ్యి అబ్బాయ్! నువ్వు వుద్యోగం మానేసి నా దగ్గర కూర్చుంటే నేను రాస్తాను"అని. ఆయన ఎలాగూ వుద్యోగం మానెయ్యడు అనే ధైర్యంతో.

ఆ విశ్వరూపాచారి వుద్యోగం మానెయ్యడానికి కూడా సిద్ధపడ్డాడు. ఇతన్ని "విశ్వం"అనేవారు. సౌరీస్ గారు చెప్పారు "విశ్వం! నువ్వు నాన్నగారు అన్నారు కదాని వుద్యోగం రిజైన్ చెయ్యకు. లాంగ్ లీవ్ పెట్టీ రా! ఈ పని అవ్వకపోతే, తర్వాత చూద్దువు గాని"అన్నారు. అలా ఆ విశ్వంగారు లాంగ్ లీవ్ పెట్టి, చలంగారి దగ్గర కూర్చొని,

ఆయన చెబుతుంటే, ఆత్మ కథ రాశారు. "చలం"అనే పేరుతో వచ్చిన ఆ ఆత్మ కథ 1972 చివరలో రూపుదిద్దుకుంది. చలంగారు.. వేరేవాళ్లు చెప్పే పుకార్లకీ, అపోహలకీ ఏ మాత్రం తావులేకుండా, ఆయనే తెరచిన పుస్తకం లాగ, తన జీవితంలోని సంఘటనల్ని పుస్తకరూపంలో వెలువరించారు. ఈ ఆత్మకథ రాశాక, అంటే డిక్టేట్ చేశాక, ఆయన "చలం మిత్రులు"అనే పుస్తకం రాశారు. అంటే, ఈ ఆత్మకథ లో పేర్కొన లేకపోయిన కొంతమంది గాఢమైన మిత్రుల గురించి, రాసిన ఈ "చలం మిత్రులు"అనే పుస్తకమే ఆయన రాసిన చిట్టచివరి పుస్తకం. అది వచ్చింది 1973 లో.

1973 లో ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో "బాలాంత్రపు రజనీ కాంతారావు "గారు, చలం గారి దగ్గరకు వెళ్లి, ఆయన్ని ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసి, ఆ తరువాత మరికొంత మంది సాహితీ ప్రముఖుల అభిప్రాయాలు కూర్చి ఆ ప్రత్యేక కార్యక్రమాన్ని 1973 మే 18 న ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి, చలంగారి 79వ పుట్టిన రోజు సందర్భంగా ప్రసారం చేశారు. ఇప్పటికి కూడా సాహితీ వేత్తలందరూ ఆ కార్యక్రమాన్ని ఒక ప్రామాణికమైన అభిప్రాయ వేదికగా పరిగణిస్తూ ఉంటారు.

ఇక్కడనుండి మరొక 6 సంవత్సరాలు అంటే, చలంగారి అంత్యదశ వరకూ మనం మాట్లాడుకోగలిగినటువంటి విశేషాలు ఆయన ఆరోగ్యం గురించి, అనారోగ్యం గురించి మాత్రమే. ఈ కథని కాసేపు అంటే 1973 దగ్గర ఆపి ఒక 6 సంవత్సరాలు వెనక్కి వెళ్లి, మళ్ళీ ముందుకు వద్దాం.

1967 లో చలం గారికి తలంతా దిమ్మెత్తి పోయింది. అప్పటికే ఆయనకు కాళ్ళూ, చేతులూ పట్టు ఇవ్వడం లేదు. మూతి కొద్దిగా వంకర పోయింది. అలాగే ఒక కన్ను కూడా ఒరిగిపోయింది. మాట కూడా ముద్ద ముద్దగా అయిపోయింది. ఆయనకు వున్న హై బి.పి వల్ల పెరాల్సిస్ స్ట్రోక్ వచ్చిందని తెలుసుకున్నారు. ట్రీట్ మెంట్ ఇవ్వడం మొదలు పెట్టారు గానీ, చలంగారికి ఇంగ్లీష్ మందులు ఎక్కువగా పనికిరావు. ఆ అరుణా చలంలోనే "సారంగ పాణి"అని ఒక సానిటరీ ఇనస్పెక్టర్ ఒకాయన ఉండేవాడు. ఆయన చలం గారు వెళ్లిన దగ్గర నుండి ఆ కుటుంబానికి చాలా సన్నిహితుడుగా ఉండడమే కాకుండా, రక్షకుడిగా కూడా ఉండేవాడు. ఆ సారంగపాణి గారు, చలం గారికి చెప్పారు "ఇలా పెరలాసిస్ స్ట్రోక్ వస్తే గనక, పావురాయి రక్తం ఒంటికి రాయడం, పావురాయి మాంసం తినడం చేస్తే తగ్గుతుంది." అని.

చలం గారికి అలాంటి వైద్యాల మీద నమ్మకం వుంది కదా! అందుకని ఒంటికి పావురాయి రక్తం రాసుకున్నారు. పావురాయి మాంసం తిన్నారు. అయినా మధ్య మధ్యలో డాక్టర్లతో పరీక్షలు చేయించుకోవడానికి వెళ్ళినపుడు, ఒళ్ళంతా రక్తం రాసుకొని వెళితే, చాలా భీభత్సంగా వుండేవాళ్ళట. అందరూ ఆశ్చర్యంగా చూసేవారు. మొత్తానికి

2,3 నెలల తర్వాత అప్పుడు వచ్చిన పెరాల్సిస్ స్ట్రోక్ మరీ కొనసాగకుండా, ఆయన్ని మళ్ళీ మామూలు మనిషిని చేసింది. ఇదంతా రంగనాయకమ్మ గారు చనిపోవడానికి ముందే.

చలంగారి దగ్గరకు ఒక డాక్టర్ గారు వస్తుండేవారు. ఆయన మద్రాస్ జనరల్ హాస్పిటల్లో ఉండేవారు. E. N. T. స్పెషలిస్ట్. ఆయన పేరు డా:చిట్టూరి సత్యన్నారాయణ గారు. ఆయనది తూర్పు గోదావరి జిల్లా పామఱ్రు. చాలా సాహితీ ప్రియుడు. సాహిత్యంతో సంబంధం వున్న వాళ్ళందరి తోనూ స్నేహం చేసేవాడు. ఆ తరువాత రోజుల్లో 1980 ప్రాంతాల్లో శ్రీశ్రీ గారి చివరి రోజుల్లో వైద్య సలహాలూ, సదుపాయాలూ చేసింది కూడా ఈయనే. ఆయనా, ఆయన భార్య అనేక సార్లు చలం గారి దగ్గరకు వస్తుండేవారు. చలంగారికి పెరాల్సిస్ స్ట్రోక్ వచ్చి, తగ్గినపుడు కూడా వచ్చారు. చలంగారికి పరీక్షలన్నీ చేయడానికి, ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చలం గారికి అన్ని పరీక్షలు చేసిన తర్వాత, “ప్రస్తుతానికి తగ్గిపోయింది. బి. పి. కంట్రోల్ చేస్తుంటే స్ట్రోక్ రాదు.”అన్నారు. అంతే కాకుండా, అక్కడ గవర్నమెంట్ హాస్పిటల్లో “చెట్టియార్”అని ఒక డాక్టరు గారు ఉంటే, అతన్ని, చలం గారికి పరిచయం చేసి, “ఈ చలంగారు మాకు చాలా కావలసిన వారు. ఈయనకు ఫ్యామిలీ డాక్టరు లాగ ఉండాలి. ఏ అవసరం వచ్చినా, నేను లేకపోయినా, మీరు వెళ్లి జాగ్రత్తగా చూసుకోండి “అని చెప్పారు. ఆ రోజునుంచి ఆ చెట్టియార్ గారు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా, చలం గారిని చూస్తూండేవారు, 1967–68 ప్రాంతాల్లో. ఇది ఇక్కడ ఆపి మళ్ళీ మనం 1973 ప్రాంతానికి వద్దాం.

1973 లో ఆకాశవాణికి ఇంటర్వ్యూ ఇచ్చాక, 1974 లో మళ్ళీ ఒకసారి పెరలాసిస్ స్ట్రోక్ చిన్నగా వచ్చింది. కాకపోతే ఈసారి మరీ 2,3 నెలలు కాకుండా, తొందరలోనే చలంగారు మామూలు మనిషయ్యారు. ఎంత మామూలు మనిషి అయినా, ఆయన ఆరోగ్యం దిగజారుతూనే వుందని చెప్పుకోవాలి. మనిషి క్రమక్రమంగా బలహీన పడుతున్నారు. కొన్ని సార్లు ఎవరైనా అన్నం తినిపిస్తేనే గాని తినలేని పరిస్థితి. అప్పుడప్పుడు ఆయనే స్వయంగా నడవగలిగినప్పటికీ, ఒక్కోసారి ఎవరైనా నడిపిస్తే తప్ప నడవలేకపోయేవారు. మాటల్లో అయితే, స్పష్టత తగ్గి, ముద్ద ముద్దగా వస్తుండేది. ఆయన ఏం మాట్లాడుతున్నారు అనేది దగ్గరగా ఉన్నవాళ్లకు మాత్రమే అర్థమయ్యేది. బయటవాళ్ళు వెళితే, వాళ్ళు చెప్పింది దగ్గర వున్నవాళ్ళు, చలం గారికి చెప్పడం, మళ్ళీ చలం గారు చెప్పినదాన్ని వీళ్ళు, వాళ్లకి చెప్పడం ఇలా జరిగేది. ఇలా 74 నుండి దాదాపు 78 వరకు ఆరోగ్యం క్రమక్రమంగా తగ్గుతూ వచ్చింది. 78 వచ్చేసరికి ఆయన పూర్తిగా మంచానికే పరిమితమయ్యారని చెప్పుకోవచ్చు.

నర్తకి ఆయన్ని లేపి, కుర్చీలో కూర్చోబెట్టి, బయటకు తీసుకువెళ్లి, అక్కడ గన్నేరు చెట్టు ఉంటే, అక్కడ చెట్టు క్రింద కూర్చోబెట్టేవారు. అప్పటికి సంవత్సరం ముందు నుండి చలం గారి మనవరాలు కిట్టూగారూ, ఆమె భర్త

అక్కడే ఉండేవారు. వాళ్ళు కూడా ఉంటే, చేదోడు వాదోడుగా ఉంటుందని వాళ్ళిద్దరినీ కూడా అరుణాచలం లోనే ఉండమన్నారు. ఈ విషయాలు కిట్టూ గారే చెప్పారు.

భార్య రంగనాయకమ్మగారి సమాధి పక్కన అరుగు ఉంటే, ఆ పక్కనే పడక కుర్చీలో కూర్చునే వారు చలం. ఎదురుగా కనిపిస్తూవున్న అరుణాచలం వైపు సుదీర్ఘంగా చూస్తూ ఉండేవారు. 1978 జూలైలో ఒక రోజు ఉన్నట్టుండి ఒక రోజు కళ్ళు తేలేసారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. చూస్తే గుండె కొట్టుకుంటోంది. అలా రెండు, మూడు రోజులు వున్నారు. సబ్–కాన్షస్ స్టేజ్. అలాని కోమా అని కూడా అనుకోలేము. డాక్టరు గారు వచ్చి చూసారు. "బాగానే వుంది" అన్నారు గానీ, మళ్ళీ రెండో రోజు ఆయనే చెప్పారు. "నాకేదో అనుమానంగా వుంది. ఎవరికైన కబుర్లు చెయ్యాలనుకుంటే, చెయ్యండి. "అని. కబుర్లు చేశారు. కాకపోతే, మళ్ళీ 2,3 రోజులలోనే మామూలు మనిషి అయ్యారు. మాములుగా అయ్యాక "నేనెక్కడ వున్నాను. ఇన్ని రోజులున్నూ" అన్నారట.

అలా 78 లో ఒకసారి దాదాపు ప్రమాదం అంచుల వరకూ వెళ్లి, వెనక్కి వచ్చారు. 78 నుండి 79 మొదలు వరకూ కొన్ని రోజులు ఆరోగ్యం బాగానే ఉండేది. కొన్ని రోజులు బాగుండేది కాదు. ఆ సంవత్సరాల్లో చలంగారు ఉత్తరాలు రాయలేనప్పుడు సౌరీస్గారు రాస్తూండేవారు. అలా రాసిన ఉత్తరాల్లో సౌరీస్ గారు రాసారు "ఈ రోజు నాన్న గారు బాగానే వున్నారు. ఈ రోజు నాన్న సొంతంగా తినగలిగారు. ఈ రోజు మేం పెట్టాం. ఈ రోజు మేం పట్టుకుంటే తప్ప, నాన్న నడవలేకపోయారు. " ఇలా. 79 జనవరి, ఫిబ్రవరి నాటికి ఆరోగ్యం బాగా దిగజారింది. దాదాపుగా మంచం మీద ఉండి కదల్లేని స్థితి. 1979 ఏప్రిల్ 28. ఆ రోజున ఎప్పుడూ వచ్చినట్టే డాక్టర్ చెట్టియార్ గారు వచ్చారు. పరీక్ష చేశారు. ఎగశ్వాస రావడం, గొంతులో కఫం పేరుకోవడం జరిగింది. ఇంజక్షన్లు ఇచ్చి, ఆ కఫం క్లియర్ చెయ్యడం చేశారు.

మే ఒకటవ తారీఖు వచ్చింది. మరో 2,3 రోజుల్లో ఆయన అంతిమ క్షణాలు వస్తున్నాయి. ఆయన మరింత కదల్లేక పోవడం, ఎప్పుడూ కళ్ళు మూసుకొని పడుకోవడం, ఎగశ్వాస రావడం ఎక్కువయ్యాయి. మే మూడవ తారీఖున ఎప్పుడో వాళ్లకి బాగా కావలసిన బంధువులు ఎవరో ఒకావిడ వస్తే, గుర్తు పట్టి, పక్కనే కూర్చో బెట్టుకున్నారు, "ఎప్పుడో చిన్నపిల్లగా చూసాను నిన్ను" అన్నట్లుగా. కాకపోతే నోటి వెంట మాట రాలేదు. ఒక రోజు అందరూ చుట్టూ కూర్చొని వున్నారు. వాళ్ళు మాట్లాడుకుంటుంటే, చలంగారు ఉన్నట్టుండి ఒక్కసారి " ఆఁ ... " అన్నారట. అంటే వీళ్ళ మాటలు విని దానికి ప్రతిస్పందించినట్లుగా. అంతే తప్ప, తరువాత ఏమీ చైతన్యంగా లేచి కూర్చోవడం, లాంటిది ఏమీ లేదు.

79 మే 4 వ తేదీ రాత్రి సుమారు 7,8 గంటల ప్రాంతాలలో డాక్టర్ గారు పరీక్ష చేసి "పరవాలేదు. ఈయన్ని పడుకునే దిక్కు మార్చండి. పొజిషన్ మారిస్తే కొంచెం సౌకర్యంగా ఉంటుందేమో, కఫం అయితే నేను తీసేసాను.

ఎగశ్వాస వుంది. కొంచెం కొంచెంగా తగ్గుతుంది. ఇలా జాగ్రత్తగా చూసుకుంటే, మరొక సంవత్సరం పాటు బ్రతికే అవకాశం వుంది. అని చెప్పి వెళ్లిపోయారు. అది సాధారణంగా ఆశ్రమంలో భజన చేసే సమయం. అయితే సౌరీస్ చెప్పారు "భజన వద్దు. నాన్నగారికి డిస్టబెన్స్ గా ఉంటుంది. నెమ్మదిగా పాటలు మాత్రం పాడుకుందాం" అని. ఆ పాటలు పాడడం అయిపోయింది. రాత్రి సుమారు 9 గంటలు ఐంది. ఆ సమయంలో చలం గారి కళ్ళ వెంట విపరీతంగా నీళ్లు కారుతున్నాయి.

కళ్ళు మూసుకునే వున్నారు. అవి నిజంగా భావోద్వేగం వల్ల వచ్చిన కన్నీళ్లా, బాధతో వచ్చిన కన్నీళ్లా తెలియలేదు. అలా అందరూ చుట్టూ ఉండగానే, రెండు చేతులూ పైకి ఎత్తారట. వీళ్ళందరూ ఏమైనా చెబుతున్నారా? లేక లేచి కూర్చోబెట్టమని సంజ్ఞ చేస్తున్నారా?అనుకున్నారు. కానీ, ఆ లేపినటువంటి చేతులు వాలిపోయాయి. ఒక 5,10 నిముషాల పాటు ఎగ శ్వాస లేదు. కళ్ళు అలా మూసుకునే వున్నారు.

1979 మే 4వ తేదీ, రాత్రి 9. 05 నిముషాలకు చలంగారు తాను నమ్మిన ఈశ్వరుడిలో ఐక్యం అయిపోయారు. భౌతిక దేహాన్ని విడిచిన ఆయన పంచ ప్రాణాలు మరో ప్రపంచాన్ని చేరుకున్నాయి. 85 సంవత్సరాల సుదీర్ఘ జీవనయానం ముగిసింది. అది శుక్రవారం.

చలంగారు అంతకు ముందు తన చిట్టచివరి రోజుల్లో చివరి క్షణాలు దగ్గర పడుతున్నాయని తెలుసుకున్నప్పుడు ఇంట్లో వాళ్లకి చెబుతుండేవారట

"నేను గనక చనిపోతే, నన్ను పాడె మీద కట్టి తీసుకువెళ్లడం లాంటివి ఏమీ చెయ్యకండి. అందరూ వచ్చి, నా మృత దేహం చుట్టూ, భజనలు చెయ్యడం. ఇలాంటి పనులు చేయవద్దు. నేను అంపశయ్య మీద భీష్ముడిలాగే ఉండాలి. అలాగే బయట కూడా ఎవరికీ చెప్పమాకండి. ఆశ్రమంలోనూ చెప్పవద్దు.. అంతా సైలెంట్ గా జరిగిపోవాలి అంత్యక్రియలు" అని.

సౌరీస్ నచ్చజెప్పారు. "అలా కాదు నాన్నగారూ! మీకు ఎంతోమంది అభిమానులు వున్నారు. అలాగే మనం దాదాపుగా 30 సంవత్సరాలుగా ఈ ఆశ్రమంలో ఉంటున్నాము. ఎవరికీ చెప్పొద్దూ అంటే, మంచిది కాదు" అన్నారు. దానికి చలం గారు హాస్యంగా "నా చుట్టూ భజనలు అవీ చేస్తే, నేను లేచి వాళ్ళని తంతాను."అన్నారు. "సరే! ఆ తన్నేదేదో మీరు తన్నుదురు గానీ, నేను మాత్రం చెప్పకుండా ఉండలేను"అని వాళ్ళ నాన్నగారిని ఒప్పించారు.

ఆ శుక్రవారం రాత్రి అలా జరిగాక, మర్నాడు శనివారం ప్రెస్ కి చెప్పారు. బంధు మిత్రులందరూ వచ్చారు. మే 5వ తేది సాయంకాలం. ఆంధ్ర దేశంలో చాలా పత్రికలు ప్రత్యేక ఎడిషన్లు ప్రచురించాయి. 1979 మే 6వ తేదీ ఆదివారం ఉదయం చలం గారి అంత్యక్రియలు. శనివారం ఆయన మృతదేహాన్ని చూడడానికి వచ్చిన వ్యక్తులూ, అప్పటి సందర్భం, ఆయన మహా ప్రస్థానం వీటన్నిటి గురించి చెప్పడానికి నా మాటలు సరిపోవు. చలం గారంత

ప్రభావంతమైన, శక్తివంతమైన వాక్యాలూ మనకి రావు. కానీ, మధ్య మార్గంగా ఇప్పుడు చెయ్యబోయే నెరేషన్ లో మధ్య, మధ్యలో "తెలుగు–వెలుగు చలం" అనే పుస్తకంలో పురాణం వారు రాసిన వాక్యాలను తీసుకుంటున్నాను.

"ఆ శనివారం అంతా మృత్యువు ప్రసాదించిన విశ్రాంతే చలం గారికి. అగరొత్తులూ, సాంబ్రాణి ధూపాలూ, ఉడుకులాం జల్లులూ, ఆప్త పరివారం, బంధు మిత్ర కోటి సమర్పించిన పుష్పాంజలుల మధ్య, అంపశయ్య పై పడున్న భీష్ముడిలా, పాత తెల్లని బుషర్ట్ తో వున్నాడు చలం. ఆయన నాటిన దానిమ్మ చెట్టూ, చంద్ర కాంత మొక్కలూ, తురాయి చెట్లూ, రాధా మనోహరం, మల్లే, శివ గన్నేరూ, తులసీ, బోగన్ విల్లాలు తలలు వంచి నమస్కరిస్తున్నట్లున్నాయి. ఆశ్రమంలోని నెమళ్ళు క్రీంకారాలు చేస్తూ తిరుగుతూ చలం అస్తమయ వార్తను నెమరువేసుకుంటున్నాయి.

సంచలనం లేని చలం చుట్టూ, ఆయన సృష్టించిన శశిరేఖా, అమీనా, పద్మావతీ, రాజేశ్వరీ, చిత్రాంగీ పుస్తకాల్లోంచి నెమ్మదిగా దిగి, ఆ తల్లులంతా ఆత్మ ప్రదక్షణలు చేస్తున్నారు. మనుషులెవరూ స్వప్నాలలోనైనా భావించుకోలేని లావణ్య తేజస్సులతో, ఈ ధరణీతిమిర కల్మషం లోకి విలాసంగా దిగి, అరుణా చలం మీదికి ఒక చెంగున ఒక గెంతు వేసి, మెట్ల మీదనుండి నడచివచ్చినట్లు, వచ్చి, తడి ఒంటితో, జుట్టుతో పరిగెత్తి, అతడి మెడచుట్టూ చేతులు వేసి, పెదవులమీద ముద్దు పెట్టుకున్నది ఎవరు? అతిలోక లావణ్య రాసి, ఊహలలో మధురోహ చలం ప్రేయసి, కాదు ఊర్వశి ఒక వూహ పాత్ర.

ఆ ఆదివారం ఉదయాన్నే ఆయనకు స్నానం చేయించారు. తెల్లనిలుంగీ, తెల్లని బుషర్ట్ వేశారు. ముఖాన విభూతి రేఖలు దిద్ది, కుంకుమ బొట్టు పెట్టారు. ఆయన కోరిక ప్రకారం పాడె కాకుండా, ఆయన పడుకునే చక్రాల కుర్చీలోనే పడుకోబెట్టి, అంతిమయాత్రకని ప్రారంభించారు. ఆదివారం ఉదయం, వైశాఖ మాసపు ఆకాశమే కాదు, అంతిమ యాత్రలో చలం వెంట నడుస్తున్న స్త్రీలూ, పిల్లలూ ఆప్తుల ముఖాలు రవి కిరణాంగులీ నఖక్షతాలతో కలసి ఎరుపెక్కిపోతున్నాయి. రెబల్ గా వచ్చి రుషిగా మారిన చలాన్ని రమణస్థాన్ మీద ఆకాశం వంగి వీడ్కోలు చెప్పింది. ఎర్రమన్నూ, రాళ్ళ మధ్య అరుణ గిరికి వామ భాగాన, శోకిస్తున్న యమునా నదిలాగ వున్న తారు రోడ్డు మీద వెనక నుండి ఎండ తరుముకు రాగా, బంధు మిత్రుల అతి చిన్న ఆప్త సమూహం చలం ఈజీ చైర్ ని ఛాయ లాగ అనుసరిస్తుంది. ఆ చక్రాల వాలు కుర్చీలో పరచిన తెల్లని పంచె, అది 'జిల్లెళ్ళ మూడి అమ్మ' రమణ స్థాన్ కి వచ్చినపుడు పెట్టింది. కొద్ది మందే అయినా కావలసిన వారు, రావలసిన వారు అంతా వెంట రాగా చలం గారి చివరి ప్రయాణం సామూహిక మార్నింగ్ వాక్ లాగ ప్రారంభమయ్యింది.

ఆయనకు అత్యంత ప్రీతి పాత్రులు అయిన క్రిష్ణారావు, బసవరాజూ, బాబ్జీ, కె.సభా, ఆ ఈజీ చైరుని తోసుకుంటూ వెంటరాగా, పరమ పురుషునికి పరమ ఆప్తులు ఇచ్చే వీడ్కోలు లాగ వుంది. అంతే కానీ, పాడె, కుండలో నిప్పు, తడి

బట్టల వాళ్ళు, బ్రాహ్మలూ ఇలాంటి తతంగం ఏమీ లేదు. అడవికి వెళ్లి మాయమైన బాట లాగ, అరుణగిరిలో ఐక్యం కాబోతున్నాడు చలం. ఆ రోజు చలాన్ని అనుసరించిన వాళ్ళలో భగవాన్ గురించిన పుస్తకం రాసిన పర్షియన్ వనిత "తల్యార్ ఖాన్ "కూడా వుంది. రమణాశ్రమం నుండి "మౌంటెన్ పాత్"ఎడిటర్ భగవాన్ తమ్ముడి మనమడు గణేష్. చలం గారి ఫ్యామిలీ డాక్టర్ "సుబ్బరామన్ చెట్టియార్" వున్నారు. ఎందరెందరో ఆత్మీయులు వచ్చి, పుష్ప గుచ్చాలతో, శ్రద్ధాంజలి ఘటించారు. "

"లోకయాత్ర చాలించి 36 గంటలైనా ముఖ వర్చస్సులో తేడా లేదు. దేహంలో మార్పు లేదు. ఆ ఈజీ చైర్ తన యజమానిని తిరిగిరాని మార్నింగ్ వాక్ ని తీసుకువెళుతున్నాను అనే బాధతో నల్లని దారితో, మెల్లగా మొరపెట్టుకుందా అన్నట్లుగా చక్రాలు కిరకిర మని రోదించాయి. తిరువణ్ణామలై కి, రమణాశ్రమం సుమారుగా మైలున్నర, రెండు మైళ్ళు ఉంటుంది. వూరికి చివరిలో ఉన్న ఇల్లు చలం గారిది. చలంగారి ఇంటికీ, ఒక మైలు లోగానే "యమ లింగాల " దేవాలయం ఒకటుంది. చలంగారి ఇంటి నుండి బయలుదేరిన ఈజీ చైర్ వచ్చి అటు యమలింగాల దేవాలయం, ఇటు అరుణగిరి మధ్యలో ఆగింది. అక్కడ శ్మశానం వుంది. చలంగారి వెంట వచ్చిన వాళ్లల్లో యామిజాల పద్మనాభ స్వామి, వజీర్ రహ్మాన్, రాయుడు నాగేశ్వరావు వున్నారు. రమణస్థాన్ నుండి కొంత మంది ఆప్తులు "మేం చూడలేం" అని శ్మశానానికి రాలేదు. మొత్తానికి అందరూ కలిపి 30,40,మంది. అన్ని మతాల వాళ్ళూ చలంగారి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. కట్టెల్ని సరిచేసి, ఈజీ చైర్ నుండి దించి, పడుకోబెట్టారు. ఎండ చురచుర మంటోంది. కనుచూపు మేరలో నీడని ఇచ్చే చెట్టు ఒక్కటి కూడా లేదు. అన్ని రాళ్లే, బండలే.

సౌరీస్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిరాడంబరంగా జరుగుతున్నాయి. యామిజాల పద్మనాభ స్వామి వాల్మీకి రామాయణం నుండి జటాయువుని, శ్రీరామచంద్రుడు అనుగ్రహించిన ఘట్టంలోని శ్లోకాలను చదివారు. ఆ తరువాత చలం గారు రాసిన 'సుధ'అనే పుస్తకంలో నుండి అరుణాచలేశ్వరుని స్తుతిస్తున్నటువంటి ఒక గేయాన్ని రాయుడు నాగేశ్వరావు గానం చేశారు.

చలానికి చాలా ప్రియమైన చెల్లెలి పిల్లల్లో ఒకరు వక్కలంక నరసింహ రావుగారు చలం గారి చితికి మంచి గంధపు చెక్కలతో నిప్పు పెట్టారు. సౌరీస్ "ప్రేమతో మీరు కూడా వేసుకోండి చితిమీద"అని ఆ చందనపు ముక్కలు తలా ఒకటీ ఇచ్చారు. ఆ చందనపు ముక్కల గురించి ఒక కథ ఏమిటంటే...

ఎప్పుడో ఒక సంవత్సరం క్రిందట ఎవరో ఒకాయన రాయలసీమ నుండి వచ్చారు. ఆయనకు చలంగారు ఎవరో తెలీదు. రచయత అని అంత కన్నా తెలీదు. అందరితో పాటు అతను కూడా వచ్చాడు. వట్టి చేతులతో రావడం ఎందుకని ఇన్ని గంధపు చెక్కలు తీసుకువచ్చాడు. అవి చూసి చలం గారు అన్నారట "ఈశ్వరుడు నాకు అంత్యకాలం వచ్చిందని, గంధపు చెక్కలు పంపించాడు."అని. ఆయన చమత్కరించి నట్లుగానే, ఆ చందనపు చెక్కలనే ఆప్త

మిత్రులందరూ కాలిపోతున్న ఆయన దేహం మీద వేశారు. దహన కాండ పూర్తి అయ్యేవరకూ సభా, బాబ్జీ, రాయుడు నాగేశ్వరావు అక్కడే వున్నారు. అంతలో ఒకాయన "ఒక్కరు ఉంటే చాలు మిగతా వారు వచ్చేయండి." అనటంతో అందరూ వెళ్లిపోయారు. బాబ్జీ మాత్రం అక్కడే వున్నాడు. చలంగారిని తీసుకువెళ్లిన ఈజీ చైర్ ని ఆ కాటికాపరికి ఇచ్చేసారు. తర్వాత ఆ ఈజీ చైర్ ని ఒక జర్మన్ యువతి కొనుక్కున్నారు. శుక్రవారం రాత్రి 9.05 నిముషాలకు ఆయన చనిపోతే, ఆదివారం ఉదయం 9.05 నిముషాలకు అంత్యక్రియలు జరిగాయి.

శనివారం నాడు గానీ, ఆ తరువాత గానీ ఆయన అలా వున్నప్పుడు ఎవరినీ ఫోటోలు తియ్యనివ్వలేదు. ఎందుకంటే, చలం బాడీ అలా దయనీయంగా వున్నప్పుడు , ఫోటోలు తియ్యడం ఆ హంగామా అంతా మంచిది కదనుకున్నరు. ఆ విధంగా ఆదివారం ఉదయం చలం భౌతిక కాయానికి నిరాడంబరంగా అంత్యక్రియలు చేసి వచ్చాక, సుమారు 50 మంది రమణస్థాన్ లో భోజనాలు చేశారు. సోమవారం ఉదయం ఏడు గంటలకు చెంబుతో పాలు తీసుకొని నరసింహారావు గారు వెళ్లి, చితిమీద పోశారు. అక్కడ నుండి చితాభస్మాన్నీ, అస్థికల్నీ సేకరించడానికని ఒక మట్టి పాత్రా, తెల్లని బట్టా తీసుకువెళ్లారు. ఆ బూడిద తెల్లటి రజిత భస్మం లాగా, మంచు ముద్దలాగా కనిపించిందట. ఆ భస్మరాశిని తడుపుకుంటూ, అస్థికల కలశానికి తెల్లటి వస్త్రాన్ని కప్పి, దాన్ని చక్రాల కుర్చీలో రమణస్థాన్ కి తీసుకువచ్చారు. ఆ అస్థికల కలశాన్ని రమణ స్థాన్ ప్రవేశంలో చలంగారి భార్య రంగనాయకమ్మ గారి సమాధి పక్కనే పాతి పెట్టి, సరిగ్గా ఆమె సమాధి ఉన్నట్లుగానే వర్తులాకారంలో ఒక సమాధి కట్టారు.

ఆ తరువాత సమాధి పూర్తవ్వగానే చలంగారు పెంచుకున్న కుక్కలు రోజూ వెళ్లి, ఆ సమాధి మీద పడుకుంటూ వుండేవి. ఆ తరువాత రోజుల్లో ఆ సమాధి ఆకారం మారింది. ఆ విశేషాలన్నీ తరవాత వ్రాస్తాను. 30 ఏళ్ల పాటు ఆంధ్ర దేశానికి ఎంతో దూరంలో ఎక్కడో ఉన్నటువంటి చలం గారు, బహుశా ఇప్పుడు కూడా ఎక్కడో వుండే వుంటారు. నిజానికి చనిపోయింది చలం కాదు. ఈ లోకాన్ని విడిచింది ఒక భౌతిక దేహం మాత్రమే. చలం అప్పటికీ, ఇప్పటికీ చిరంజీవే.

ఇప్పుడు చలం గారి గురించి ఆయన మనవరాలు కిట్టుగారు చెప్పిన విశేషాలు. "నాకు వూహ తెలిసిన దగ్గర నుండి చలం గారి దగ్గరే పెరిగాను. మా నాన్నగారి పేరు శ్రీనివాసరావు. మా అమ్మగారి పేరు చిత్ర. మా అక్కాచెల్లెళ్ల మందరమూ చలంగారి దగ్గరే పెరిగాం. ఆయన గురించి చెప్పాలంటే మాటలు లేవు. మా మీద ఎంతో ప్రేమ చూపించేవారు. మా తండ్రిగారు కొన్ని కారణాల వల్ల మాకు దూరంగా ఉండడం వల్ల, చలం గారినే మేం "నాన్నా!" పిలిచేవాళ్ళం. "తాతగారూ!"అని ఏనాడూ పిలిచేవాళ్ళం కాదు. బయట వాళ్లకు చెప్పేటప్పుడు మాత్రం"మా తాత గారు"అనే చెప్పేవాళ్ళం. చలంగారు కూడా అంతే ప్రేమగా మా పిల్లలు అనే చెప్పేవాళ్ళు.

78 లో ఆయనకు ఒంట్లో బాగుండకపోతే, నేనూ, మావారూ, సౌరీస్, నర్తకీ అడగడం మూలాన వారి దగ్గర ఉండి, వారికి సేవ చేసుకోగలిగాం. మావారు కూడా చలం గారిని ఎత్తడం, వీల్ చైర్ లో పడుకోబెట్టడం, బయటకు తీసుకువెళ్లడం చేసేవారు. ఎప్పుడంటే ,అప్పుడు షికారుగా బయటకు తీసుకువెళ్లి, తీసుకువచ్చేవారు. అలా మా జన్మధన్యమైంది అనుకుంటాము. అలాగే ఆయన కూడా మమ్మల్ని ఎంతో ప్రేమగా చూసుకునేవారు. ఆయన గురించి మిగతా వాళ్లందరికీ పుస్తకాల ద్వారానే తెలుసు. మాకు చలం గారంటే పుస్తకాల ద్వారా ఏమీ తెలీదు. ఆయన ప్రేమలో మేం తడిసి ముద్దయ్యేము. ఇప్పుడు నాకు 60 ఏళ్ళు. పెద్దదాన్నయ్యాను. అయినా తలచుకుంటే, ఆ జ్ఞాపకాలు బాగుంటాయి. సౌరీస్ ని మేం 'షౌ'అని పిలిచేవాళ్ళం. మా అమ్మకంటే కూడా ఎంతో ప్రేమగా చూసేవాళ్ళు. మా పిల్లలు మాత్రం 'షౌ' ని అమ్మమ్మా అని పిలిచేవాళ్ళు. వాళ్ళు కూడా ఎంతో ఆత్మీయంగా పెరిగారు. ఇప్పుడు అందరూ కూడా సుఖంగా, సంతోషంగా వున్నారు. మేం అందరమూ కూడా ఆయన దయవల్లనే బాగున్నాం. మేం ఏం చేసినా ఏం అనేవారు కాదు. ఆయన ఒక బనీనూ, లుంగీతో ఉండేవారు. ఆయనకు మేం రకరకాలుగా హెయిర్ బేండ్ లు పెట్టి,ముఖానికి పౌడర్ రాసి, బొట్లు పెట్టి, కాటుక రాసి.. ఆడుకునేవారం.

ఆయన్ని చూడ్డానికి ఆంధ్రా నుండి ఎవరైనా వచ్చినపుడు “అవన్నీ తుడిచేయ్యండి. చూడ్డానికి అలా బాగుండదు “ అంటే ఆయన ఒప్పుకునేవారు కాదు. “వద్దు. అలా ఉండనీ. మా పిల్లలు నాకిది చేశారు. నాకు సంతోషం. ఇలా చూపించుకోవడం. ఎందుకు తుడవాలి? ఇలాగే చూస్తారు వాళ్ళు “అని మమ్మల్నే వెనకేసుకువచ్చేవారు. 'షౌ' మా యెడల, అంటే ఏదన్నా గొడవ చేస్తే, మమ్మల్ని పనిష్ చేసేవారు. రెండు సీత ఫలం చెట్లు ఉండేవి. మాకు డిసిప్లిన్ నేర్పించాలని,ఆ చెట్లకి నన్నూ, మా అక్కయ్యనీ వూరికే కట్టేసేవారు.

మా ఎదురుగుండా చలం గారు కూర్చొని, “చాలా సేపటి నుండి నిలుచున్నారు. విప్పు షౌ “అనేవారు.

“లేదు నాన్నా! వాళ్లకు తెలియాలి. నువ్వు వెళ్లి భోజనం చెయ్!” అనేవారావిడ.

“నువ్వు కట్లు విప్పిన దాకా, నేను భోజనం చెయ్యను”అని చెప్పి, అలా ఎదురుగుండా కూర్చునేవారు. అలా పది నిముషాలూ, పావు గంటా అంతకంటే షౌ కూడా ఎక్కువగా పనిష్ చేసేవారు కాదు. మమ్మల్ని అలా చూడబట్టే, మేం ఇప్పుడు మా జీవితాల్ని ఒడిదుడుకులు వచ్చినా గానీ, తట్టుకోగలుగుతున్నాం అని అనుకుంటాం. అంత ఇదిగా చలంగారి పిల్లలంటే ఇష్టం.ఎవరైనా పిల్లల్ని కొడుతుంటే, “నన్ను కొట్టొద్దూ--- నన్ను కొట్టొద్దూ---” అనేవారు. అంటే, ఆ పిల్లాడి బాధను అతను అనుభవించేవారు. అంత గొప్ప వ్యక్తి చలం గారు. మాకు తాతగారు.. కాదు.. నాన్న గారు. మా సొంత నాన్నగారు మాకు పెద్దగా తెలీదు. ఎక్కువగా నర్తకీ, నేనూ రాత్రి పూట ఈ నాన్న గారి మంచం దగ్గరే కూర్చునేవారం. అప్పుడు నేను ప్రెగ్నెంట్. మా మూడో అమ్మాయి కడుపులో వుంది. ఎనిమిదవ నెల.

మేము నర్తకిని అమ్మా!అనేవాళ్ళం. నేను నర్తకితో అనేదానిని ”నాకు గనక ఇప్పుడు డెలివరి అయ్యి, నాన్న ఇప్పుడు చనిపోతే, నాకు కూతురు పుట్టడం వల్లే నాన్న చనిపోయారని అంటారేమో. నాకు డెలివరి అవ్వ కూడదమ్మా! నాకు మందులివ్వు.”అని . అలాంటి అపవాదు నా పిల్లలకు రాకూడదు.అనుకున్నాను. కానీ, నర్తకి అనేది”అట్లా ఎప్పుడూ అనుకోవద్దమ్మా! డెలివరీ అనేది ఎప్పుడన్నా జరగవచ్చు. చావు అనేది ఎప్పుడన్నా రావచ్చు. ఆయన ఎప్పటి నుండో మంచం మీద వున్నారు.”అంది. కానీ, నేను చనిపోయేముందు దగ్గరగా చూశాను. కింద కాళ్ల దగ్గర నర్తకి పడుకొని వుంది. నేనేమో గోడకి ఆనుకొని కూర్చున్నాను. ఈ విషయమే మాట్లాడుకుంటున్నాం. అంతలోనే చలంగారు చేతులు పైకి ఎత్తారు. ఎత్తేటప్పటికీ రికవరీ అవుతున్నారేమో అనుకున్నాం. ఎవరినైనా పిలుస్తున్నారు. లేపమంటున్నారు. అనుకున్నాను.

“నర్తకీ...నర్తకీ ... నాన్న చేతులు ఎత్తుతున్నారు. నాన్నకి బాగయింది. లేచి కూర్చోబెడదాం రా!”అని నర్తకిని పిలుస్తుంటే... అప్పుడు నర్తకి అర్థమయిపోయి, “ముందు షౌ ని పిలుచుకు రా... పో.. “అంది. నేను నిండు నెలల గర్భిణిని. నేను కింద నుండి లేచి, షౌ దగ్గరకు వెళ్లి, “షౌ... షౌ ... నాన్న...నాన్న... “అని పిలిచేటప్పటికి షౌ కి కూడా అర్థమైపోయింది. ఇక అందరమూ కూడా చలం గారి చుట్టూ కూర్చున్నాం. చలం గారిని చూడాలని, పంజరం లోని చిలక ఒకటే కొట్టుకుంటోంది. ఎవరో చిలకని తీసుకొచ్చారు. అది కూడా నడచుకుంటూ వచ్చి, చలంగారి మంచం ఎక్కి, చలం గారి బుగ్గల్ని తడిమింది. మేం అందరం చూస్తూనే వున్నాం. అంతే ... చలం గారు వెళ్లిపోయారు. అప్పుడు అనుకోకుండా ‘చే’ కూడా మద్రాస్ నుండి వచ్చింది. చే, చిట్టి పాపా, టిప్పూ అందరూ వచ్చారన్నమాట. అది నేను కళ్లారా చూసిన చలంగారి మరణం. చాలా బాధాకరం”

చలం గారి నిర్యాణానంతరం ఆంధ్రదేశంలో పత్రికలోని వార్తలు. ఆయన మహా ప్రస్థానం తర్వాత ‘రమణస్థాన్’ పరిసరాలు ఏమయ్యాయి? ఇలాంటివన్నీ తరవాత భాగంలో తెలుసుకుందాం.

★★★★★★★★★★★

(కొనసాగింపు వచ్చేనెలలో)

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 మే 7 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS